క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్‌శాఖ సీఐ కొండారెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని పందిళ్లపల్లె టోల్ గేట్ వద్ద ఆదివారం కంభం ఎక్సైజ్ శాఖ సీఐ ఎస్. కొండారెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణా జరుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా, అమ్మినా సమాచారం అందించాలని సీఐ కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

అంబేడ్కర్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కంభం: షెడ్యూల్డ్ కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఆధ్వర్యంలో ముద్రించిన 2025 సంవత్సర డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డైరీలు, క్యాలెండర్‌లను శుక్రవారం రాత్రి విజయవాడలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆర్. సుబ్బారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన పూర్తి సమాచారంతో ప్రతి ఏడాది క్యాలెండర్లు, డైరీలు ముద్రిస్తున్నట్లు చెన్నకేశవరావు తెలిపారు. డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, కమిటీ సభ్యులు హాజరైనట్లు తెలిపారు.

పశ్చిమ ప్రకాశంలో విద్యాభివృద్ధికి కృషి

మార్కాపురం: జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎన్ఎస్ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 2016లో అగ్రికల్చర్, 2017లో హార్టికల్చర్, 2019లో లా కళాశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. తమ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు విదేశాలలో మంచి స్థానాల్లో ఉన్నారని చెప్పేందుకు సంతోషంగా ఉందన్నారు. పలువురు పేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ ఇస్తున్నామన్నారు. ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల తరఫున ఏటా మార్కాపురం, పెద్దారవీడు మండలాల్లో ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పనులతోపాటు రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు చెప్పారు. కళాశాలలో వ్యవసాయ సమాచార కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఉచితంగా భూసార పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. రాష్ట్రంలో మొత్తం 6 వ్యవసాయ కళాశాలలు ఉండగా అందులో రెండింటికి కేంద్ర ప్రభుత్వం ఐకార్ గుర్తింపు ఇచ్చిందని, అందులో తమ కళాశాల మొదటిదన్నారు. ఐకార్ గుర్తింపు ఉన్న కళాశాలల్లో చదివిన విద్యార్థులు దేశంలో ఏ యూనివర్సిటీలోనైనా ఏజీ ఎంఎస్సీ కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు.

పరిష్కారం పరిహాసమే..

- రెవెన్యూ సదస్సుల్లో అర్జీల స్వీకరణకే పరిమితం
- ఉన్నతాధికారుల చేతుల్లోనే పరిష్కారం
- చేతులెత్తేసిన రెవెన్యూ అధికారులు
- దీనికే సదస్సులు ఎందుకంటూ ప్రజల ఆవేదన



బేస్తవారిపేటలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జితేంద్రకుమార్

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు అర్జీలు స్వీకరణకే పరిమితమైంది. ప్రజల వద్దకే ప్రభుత్వం–అక్కడే సమస్యల పరిష్కారం నినాదం అభాసుపాలైంది. వివిధ సమస్యలపై ప్రజలు ఇస్తున్న అర్జీలకు అతీగతీ లేకుండా పోతోంది. సదస్సుకు హాజరై వినతులు ఇస్తే తమ సమస్యలు తీరుతాయన్న ఆశతో ప్రజలు ఇబ్బడిముబ్బడిగా అర్జీలు ఇచ్చారు. అవి అక్కడికక్కడే పరిష్కారమవుతాయని ఆశ పడ్డారు. కానీ, వారి ఆశలు అడియాసలుగానే మారాయి. అర్జీ స్వీకరిస్తున్న అధికారులు వాటిని ఎప్పుడు పరిష్కరిస్తారు, ఎవరు పరిష్కరిస్తారు, ఎన్ని రోజుల్లో కష్టాలు తీరుతాయనే అంశాలపై స్పష్టత ఇవ్వలేదు. రెవెన్యూ సమస్యలు అధికంగా రావడంతో వాటికి జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ పరిష్కారం చూపాలని క్షేత్ర స్థాయిలో చెబుతుండటంతో మరింత గందరగోళం నెలకొంది. మార్కాపురం డివిజన్‌లోని 13 మండలాల్లో దాదాపు 6200 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అర్జీలు వచ్చింది వేలల్లో అయితే పరిష్కారం చూపింది వందల్లోనే.

గిద్దలూరు నియోజకవర్గంలో అర్జీల వివరాలు

మండలం	మ్యుటేషన్	ఎఫ్‌లైన్	అసైన్‌మెంట్/ నివేశన స్థలం	మొత్తం
అర్ధవీడు	444	63	212	740
కంభం	245	45	47	339
రాచర్ల	263	35	33	331
బేస్తవారిపేట	191	69	05	269
గిద్దలూరు	395	57	10	480
కొమరోలు	315	90	144	620

అవి కూడా సర్టిఫికెట్లే కావడం గమనార్హం.

వినతుల వెల్లువ

జిల్లా వ్యాప్తంగా గత నెల 12వ తేదీ నుంచి ఈనెల 9వ తేదీ వరకు రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. వీటికి ఆయా మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఈ సదస్సుల్లో వినతులు వెల్లువెత్తాయి. ఆన్‌లైన్‌లో పేర్లు మార్పు, భూమి స్వభావం తేడా, భూ వివాదాలు పరిష్కరించాలని, భూమి కేటాయించాలని, నివేశన స్థలాలు ఇవ్వాలని అర్జీలు అందజేశారు. వెబ్‌ల్యాండ్ 1బీ అడంగల్‌లో సమస్యలను సరిదిద్దే అవకాశం తహసీల్దార్ కార్యాలయంలో లేకపోవడంతో ఉన్నతాధికారుల చర్యల కోసం ప్రజలు ఎదురు చూడక తప్పడం లేదు.

భక్తిశ్రద్ధలతో నీరాటోత్సవం

మార్కాపురం టౌన్:

పట్టణంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని గోదాదేవీగా అలంకరించి మహిళా భక్తులు నీరాటోత్సవం నిర్వహించారు. అమ్మవారికి 28వ రోజు పాశురాన్ని నివేదించారు. ఆలయ అర్చకులు పంచామృతాలతో స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. వివిధరకాల పూలతో అమ్మవారిని అలంకరించారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు టీపీ వెంకటేశ్వర్లు, నిట్టూరి వెంకట రమేష్, సభ్యులు పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

శ్రీ అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

పట్టణ శివారులో వేంచేసియున్న శ్రీ అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కరిన కోర్కెలు తీర్చి అందరినీ చల్లగా చూడాలని మార్కాపురం పట్టణ శివారులో ఉన్నటువంటి శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు ఆదివారం నిర్వహించారు. పోలేరమ్మ తల్లి భక్తులను చల్లంగా చూడాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి గాంచింది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో ఆలయ సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు.



మార్కాపురం: ప్రత్యేక అలంకరణలో గోదాదేవీ అమ్మవారు



భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ అమ్మవారు



బేస్తవారిపేట: ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయి పల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఏపీ వైఎస్సార్ టీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్, నాయకులు చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఎంఎల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. పీఆర్సీ, డీఏ బకాయిలు సకాలంలో చెల్లించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలని, నాడు, నేడు ద్వారా పాఠశాలల్లో మిగిలిపోయిన పనులు పూర్తిచేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చేయించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు, ఏపీ జీఎల్ఐ బకాయిలు విడుదల చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.



ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ టీఏ నాయకులు

గాలిపటాలు ఎగరేసేవారు జాగ్రత్తలు పాటించండి

మార్కాపురం టౌన్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గాలిపటాలు ఎగరేసే వారు విద్యుత్ షాకులకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని డీఈ సియానాయక్ సూచించారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు లేని ఖాళీ ప్రదేశాల్లో గాలిపటాలు ఎగురవేయాలన్నారు. పిల్లలు బిల్డింగులపైన గాలిపటాలు ఎగురవేసేప్పుడు పెద్దలు తప్పనిసరిగా పిల్లల వద్ద ఉండాలని సూచించారు. పొరపాటున పిల్లలు ఎగురవేసిన గాలిపటం విద్యుత్ వైర్లకు చుట్టుకుంటే ప్రమాదం సంభవించే అవకాశం ఉందని తెలిపారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

పొదిలి: అసాంఘిక కార్యక్రమాలు ఎక్కడ జరుగుతున్నా మాటు వేసి పట్టించే విధంగా డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని సీఐ వెంకటేశ్వర్లు చెప్పారు. ఆదివారం మాట్లాడుతూ పేకాట, కోడి పందేలు, బైక్ రేసులు, ఇతర జూదాలు ఎక్కడ జరుగుతున్నా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. డ్రోన్ ఉపయోగించటం ద్వారా వారి ఫొటోల ఆధారంగా పట్టుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసుల అనుమతి తీసుకునివస్తామని, డబ్బులు వసూలు చేసే వారి పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. పండగ సందర్భంగా బంధువుల ఊర్లకు వెళ్ళే వారు విలువైన వస్తువులను ఇంటిలో ఉంచుకోవద్దని సూచించారు. సంక్రాంతి పండగను సంతోషంగా, ప్రశాంతంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం డ్రోన్‌ను ఆపరేట్ చేసి పనితీరును వివరించారు.

ఆదర్శం వివేకానందుని జీవితం



వివేకానందుడి రథం ఊరేగింపులో విద్యార్థులు, నిర్వాహకులు



స్వామి వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



వివేకానంద జయంతి వేడుకల్లో సభ్యులు

మార్కాపురం: యువతకు ఆదర్శం వివేకానందుని జీవితమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సాయిబాబా మందిరం వ్యవస్థాపక కార్యదర్శి గోపాలుని హరిహరరావు అన్నారు. వివేకానందుని జయంతిని పురస్కరించుకుని త్రివిక్రమ అభ్యుదయ కళాసంఘం ఆధ్వర్యంలో గాంధీ బజారులోని రామాలయంలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యదర్శి చిత్తారి రంగనాయకులు, నూనె అల్లూరెడ్డి, జి శ్రీధర్, సుబ్రమణ్యం, చక్కా కేశవులు, రఘునాథ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జార్జి కళాశాలలో..

స్థానిక డాక్టర్ శామ్యూల్‌జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు ఆధ్వర్యంలో వివేకానంద జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి డీన్ డాక్టర్ మస్తానయ్యతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు సాధూనాయక్, డానియేల్, విజయబాబు, ఆది సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్‌పీఓ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులైన నల్లబోతుల శ్రీనివాసులు, రాయప్రోలు వెంకటేశ్వర్లు తదితరులు ఆధ్వర్యంలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

తర్లుపాడు: స్థానిక హిందూ పాఠశాలలో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోఆప్షన్ సభ్యులు అక్బర్‌అలీ, నెహ్రూ యూత్ అధ్యక్షుడు బి.పుల్లయ్య, బి.రామకృష్ణారెడ్డి, గోను సుబ్బారావు, ఉపాధ్యాయులు కోటి మోహన్, సుబ్రమణ్యం, ఎం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

గిద్దలూరు రూరల్: స్వామి వివేకానందుడి 162 వ జయంతి వేడుకలను బీజేపీ నాయకుడు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నంద్యాల రోడ్డులో గల వివేకానంద కాలనీలోని స్వామి వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని గ్రంథాలయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్‌యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో స్వామి వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గిద్దలూరు రూరల్: స్వామి వివేకానందుడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్ రెడ్డి కుమారుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని రామకృష్ణ ధ్యాన మందిరంలో యువజన దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు వివేకానందుడు, భరతమాత వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో ధ్యాన మందిరం నిర్వాహకులు పి.హనుమంతారెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయ సంఘ నాయకులు జి.రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పూలమాలలు వేస్తున్న హరిహరరావు తదితరులు



వివేకానందుని విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కుమారుడికి శతాధిక వృద్ధుడి నివాళి

కొమరోలు: తన కుమారుడు అనారోగ్యంతో మృతి చెందగా శతాధిక వృద్ధుడు బోరున విలపించాడు. ఈ విషాద సంఘటన మండలంలోని గోపాలుని పల్లె గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గోపాలునిపల్లె గ్రామానికి చెందిన ఎస్‌బీఎన్ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి(70) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. కాగా ఆయన అంతిమ సంస్కారానికి ఆదివారం ఏర్పాటు చేశారు. శతాధిక వృద్ధుడైన వెంకటరెడ్డికి తన కుమారుడు మృతి చెందిన విషయాన్ని ఆదివారం తెలుపగా భౌతికకాయాన్ని చూసి భోరున విలపించారు. ఈ సంఘటనను చూసిన వారు కంటతడి పెట్టారు. బందుగుల నారాయణరెడ్డి మృతదేహానికి జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, ఎంపీపీ కామూరి అమూల్య, మండల విద్యాశాఖాధికారులు జె.వెంకటేశ్వర్లు, బొర్రా వెంకటరత్నం నివాళులర్పించారు. యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో మృతదేహంపై యూటీఎఫ్ జెండా కప్పి నివాళులర్పించారు.



నారాయణరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తండ్రి వెంకటరెడ్డి

ప్రజలందరూ సంతోషంగా సంక్రాంతి జరుపుకోవాలి

- మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి



అన్నా రాంబాబు



జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలోని ప్రజలు, వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి కోరారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మూడురోజుల పండుగ ప్రజల జీవితాల్లో ఆనందం తేవాలని వారు ఆకాంక్షించారు. అన్నీ జాగ్రత్తలు పాటిస్తూ సంతోషంగా పండుగను జరుపుకోవాలని సూచించారు.

షటిల్ విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలతో సీఐ వెంకటేశ్వర్లు, శ్రావణి, భాస్కర్

పొదిలి: స్థానిక విశ్వశాంతి పాఠశాలలో సంక్రాంతి సందర్భంగా జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పొదిలి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు సీఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆదివారం బహుమతుల పంపిణీ జరిగింది. క్రీడా ప్రాంగణం అవసరం పొదిలికి ఎంతో ఉందని ప్రభుత్వ దృష్టికి ఈవిషయం తీసుకవెళ్ళి సాధించుకోవాలని పలువురు కోరారు. టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్(పండు), ఎస్ఆర్ఐ కాసు వెంకటేశ్వరరెడ్డి బహుమతులు సమకూర్చారు. జిల్లా స్థాయి మెన్స్ విభాగంలో రహమాన్, రమేష్, శ్రీనాథ్, హర్ష, రాహుల్, తేజ, ఎం.నాగేశ్వరరావు, అజీజ టీంలు గెలుపొందాయి. 50 ప్లస్ విభాగంలో ఎం.నాగేశ్వరరావు, అజీజ్, శ్రీనివాసరెడ్డి, రవికుమార్, రామకృష్ణారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, ఎల్.శ్రీనివాసరెడ్డి, షేక్ వలి టీంలు గెలుపొందాయి. పొదిలి స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను రాము, వెంకట్, బాలు, శ్రీనివాసరెడ్డి, సుబ్రమణ్యం, హిమతేజ టీంలు గెలుపొందారు. విజేతలకు సీఐ వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు గునుపూడి భాస్కర్, జిల్లా కాపు సంఘం నాయకులు శ్రావణి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బహుమతులను పంపిణీ చేశారు. మాజీ ఉపసర్పంచ్ షేక్.జిలానీ, రోళ్ళ శ్రీను, కాసు సుధాకరరెడ్డి, ఎం.విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే జైలుకే

- సీఐ సుబ్బారావు హెచ్చరిక



మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, రూరల్ పరిధిలోని ప్రాంతాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట ఇతరత్రా నిషేధిత ఆటల్లో పాల్గొన్నా, నిర్వహించినా వారిని జైలుకు పంపుతామని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. ఆదివారం ఆయన సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ పండుగల పేరుతో గ్రామాల్లో, పట్టణంలో వీటిని నిర్వహిస్తే ఇబ్బందులు పడతారన్నారు. సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కోడి పందేలు, పేకాట కోసం స్థలాలు ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత జైలుకు వెళితే భవిష్యత్తు ఉండదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పాసుపోర్టు, ఉద్యోగాలకు అడ్డంకిగా మారతాయన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండుగను జరుపుకోవాలన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

పొదిలి: స్థానిక ఎస్వీ గార్డెన్స్‌లో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సాంప్రదాయ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు ఏ.వీరారెడ్డి ముగ్గుల పోటీలను ప్రారంభించారు. పిండి వంటలను విందులో వడ్డించారు. జిల్లా కన్వీనర్ వనజాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం, మహమ్మద్ రఫీ బృందం ఆలపించిన సినీ గీతాలు ఆహూతులను అలరించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కనుమరుగై పోతున్న సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలియజేప్పేలా మానవత సంస్థ సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరావు, కల్లం వెంకట సుబ్బారెడ్డి, కె.యల్లమందారెడ్డి, శ్రావణి వెంకటేశ్వర్లు, సామంతపూడి నాగేశ్వరరావు, బండి అశోక్, సోమిశెట్టి చిరంజీవి, బివి.రెడ్డి, వినోద్‌రాజ్, తాడికొండ వెంకటరావు, జీసీ సుబ్బారావు, మేడా నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని కాటూరివారి పాలెంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాటూరి అశోక్, బోడపాటి అశోక్, కోక వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబరాల్లో భాగంగా మహిళలకు ఈనెల 14వ తేదీ మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.7,116, రెండో బహుమతి రూ.5,116, మూడో బహుమతి రూ.3,116, మరో 20 మంది మహిళలకు చీరలు పంపిణీ చేస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

గిద్దలూరు రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని కుసుమ హరనాథ దేవస్థానం ఆవరణలో ఆదివారం ఉత్సాహభరితంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గం దేవాలయాల కమిటీ అధ్యక్షుడు చేరెడ్డి యర్రారెడ్డి మాట్లాడుతూ మన సంప్రదాయాలను గుర్తుచేసుకుంటూ సామూహికంగా ముగ్గులను వేయడం వల్ల సంక్రాంతి పండుగ ఆనందాన్ని చవిచూడవచ్చు అన్నారు. విశ్వ హిందూ పరిషత్‌వారి ఆధ్వర్యంలో నిర్వహించే ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు ప్రత్యేక ఆదరణతో కూడిన బహుమతులను అందజేస్తామన్నారు. విశ్వ హిందూ పరిషత్ జై భజరంగ్‌బలి నిర్వాహకులు బాలక్రిష్ణారెడ్డి, పెండెల కిరణ్‌కుమార్, రామిరెడ్డి, సోమయ్య, సూరే నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన శుద్ధ చైతన్యానంద స్వామి

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం శుద్ధ చైతన్యానంద స్వామీజీ సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు యక్కలి శేషగిరిరావు ఆధ్వర్యంలో ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ నిర్మాణ వివరాలను, విశిష్టతలను, ప్రాంత ప్రాధాన్యాలను యక్కలి శేషగిరిరావు.. స్వామీజీకి వివరించారు. నేలమాళిగలోని శ్రీరంగ నాథునికి, వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామీజీకి పట్టు వస్త్రాలను అందచేశారు. ఆలయ ప్రధాన పూజారి దివి శ్రీకాంత్ బట్టర్, సహాయ పూజారి రుషి, సాయి, యాదాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న ఆలయ పూజారి, యక్కలి తదితరులు